క్రిస్మస్ పండుగ సందర్భంగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా చర్చిలను లోని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వికారాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ చర్చితో పాటు ఆయా చర్చిలను నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం క్రైస్తవ సోదరులు చర్చిలలో ప్రార్థనలు చేస్తారు. పండుగ సందర్భంగా చర్చిలను ఒక రోజు ముందుగానే నిర్వాహకులు అందంగా అలంకరించారు. వికారాబాద్, డిసెంబర్ 24

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పరిగి, డిసెంబర్ 24: ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. సంస్థ ఉద్యోగులు, ప్రయాణికుల మధ్య వేడుకలు నిర్వహించారు. ప్రయాణికులకు క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కరుణ శ్రీ కేక్ కట్ చేసి ప్రయాణికులకు పంపిణీ చేశారు. శాంతియుత మార్గంలో అన్ని సాధ్యమన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ నర్సింగ్‌రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఖుద్దూస్, ఎంఎఫ్ జనరల్ ఏడీసీ జీవీకే రెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్ గృహనిర్మాణానికి ఆర్థిక సాయం

పెద్దేముల్, డిసెంబర్ 24: పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి మంబాపూర్ చర్చి పాస్టర్ గృహ నిర్మాణానికి మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్‌తో పాటు చర్చి ప్రతినిధులు మహిపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో తమవంతు సహాయంగా సేవలు అందిస్తామన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



నవాబుపేట, డిసెంబర్24: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయరాం, పీఏసీఎస్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్, ఎంపీవో విజయ్, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ వడ్డె రాములు ఉన్నారు.

సదస్సులో ప్రతిజ్ఞ చేస్తున్న తెలంగాణ యాంటీ నార్కోటిక్ చీఫ్ సందీప్ శాండిల్య, అధికారులు

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

తెలంగాణ యాంటీ నార్కోటిక్ చీఫ్ సందీప్ శాండిల్య

హయత్‌నగర్, డిసెంబర్ 24 : యువకులు డ్రగ్స్ బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ చీఫ్ సందీప్ శాండిల్య సూచించారు. మంగళవారం హయత్‌నగర్‌లోని వర్ధమాన్ డిగ్రీ స్కూల్‌లో దాదాపు 500 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా డ్రగ్స్‌కు బానిసైన సెలబ్రిటీలు, వారి జీవితాలను నాశనం చేసుకుని చనిపోయి నవారిపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది న్యూఇయర్ వేడుకలను యువత డ్రగ్స్ రహితంగా నిర్వహించుకోవాలన్నారు. తెలంగాణలో డ్రగ్స్‌కు అలవాటు లేకుండా ఉంటే యువకులు చాలా చురుకుగా ఉంటారని, డ్రగ్స్‌కు అలవాటుపడితే వారి బుద్ధి మందగిస్తుందని తెలిపారు. నూత సంవత్సర వేడుకల సందర్భంగా పబ్స్, హోటల్స్, రిసార్ట్స్ నిర్వాహకులు డ్రగ్స్ లేకుండా వేడుకలు నిర్వహించుకోవాలని, డ్రాగ్స్ స్నిపర్స్‌తో ప్రత్యేక టీమ్‌లు నిఘా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాంటీ అవేర్‌నెస్ టీమ్ డీఎస్పీ పి.సుబ్బిరామిరెడ్డి, యాంటీ డ్రగ్స్ రాచకొండ డీఎస్పీ పి.రమేశ్, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగ రాజుగౌడ్, యాంటీ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు రామ్‌ప్రసాద్, శ్రీనివాసులు, తెలంగాణ-3 ఎన్‌సీసీ బెటాలియన్ హైదరాబాద్ గ్రూప్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్న కేంద్రం : సీపీఎం

కందుకూరు, డిసెంబర్ 24 : కేంద్రం పెట్టుబడి దారుల కొమ్ము కాస్తుందని సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, జగదీశ్ తెలిపారు. మండల మహాసభలను సీనియర్ నాయకులు మంజయ్య జెండాను ఆవిష్కరించి ప్రారంభించిన తర్వాత వారు మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మికులపై అనేక నిర్బంధాలు కొనసాగుతున్నాయని, నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల, కార్మికుల పొట్టకొడుతుందని చెప్పారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైనట్లు పేర్కొన్నారు. తక్షణమే 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.సమావేశం అనంతరం మండల నూతన కార్యదర్శిగా బుట్టి బాల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దొంగలతో పాటు స్వాధీనం చేసుకున్న ఆటోలతో మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ రవికుమార్,క్రైం సిబ్బంది

పార్కింగ్‌చేసిన ఆటోలు అపహరణ

వెంగళరావునగర్, డిసెంబర్ 24 : రాత్రి వేళల్లో పార్కింగ్ చేసిన ఆటోలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను మధురానగర్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 6 ఆటోలను స్వాధీనం చేస్తున్నారు. మంగళవారం మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ రవికుమార్‌తో కలిసి పంజాగుట్ట డివిజన్ ఏసీపీ మోహన్ కుమార్ వివరాలు వెల్లడించారు. శంషాబాద్‌కు చెందిన కల్యాం వెంకటేశ్ ఆటోడ్రైవర్. అయితే వచ్చే డబ్బు సరిపోకపోవడంతో ఆటోలను చోరీచేసి విక్రయించాలకున్నాడు. అందుకు శంషాబాద్‌లో ఉండే స్నేహితులు పాముల రాజు, తూర్పాటి శ్రీశైలంలను కలుపుకున్నాడు. ఇలా ముగ్గురు ముఠాగా ఏర్పడి.. రాత్రి వేళల్లో నగరంలో పార్కింగ్ చేసే ఆటోలను గుర్తించి అపహరించుకెళ్లి విక్రయించేవారు. ఒక్కో ఆటోను రూ.20 నుంచి రూ.25వేలకు విక్రయించి వచ్చిన డబ్బును పంచుకునేవారు. అయితే చోరీ చేసిన ఆటో ఈ ముగ్గురు వెళ్తూ యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆటోల చోరీ విషయం బయటపడింది.

స్నేహితుడి ఇంటిముందు ఆగగా ఢీకొన్న బైక్

ఒకరి మృతి, మరికొందరికి గాయాలు

మలక్‌పేట, డిసెంబర్ 24 : స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరై.. తిరిగి వస్తూ మరో స్నేహితుడి ఇంటిముందు ఆగగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరికొందరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మూసారాంబాగ్ వెస్ట్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన గడిగి సాయికిరణ్(32), గడిగె సందీప్(33)లు అన్నదమ్ములు. సోమవారం రాత్రి సందీప్ మిత్రుడు ఉమేశ్ పుట్టిన రోజు వేడుకలకు ఇద్దరు అన్నదమ్ములు స్నేహితులతో కలిసి వెళ్లారు. వేడుకలు ముగించుకొని తిరిగి వస్తూ సంజీవయ్యనగర్ కాలనీ వద్ద స్నేహితుని ఇంటిముందు నిలబడి ఉండగా.. పాత మలక్‌పేట శంకర్‌నగర్‌కు చెందిన షేక్ షాబాజ్(19) అతివేగంగా బుల్లెట్ బైక్(టీజీ 13,ఏ0010)పై వచ్చి వారిని ఢీకొట్టి వెళ్లిపోయాడు. దాంతో తీవ్ర గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ సందీప్ మృతి చెందాడు. మృతుని సోదరుడు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నిందితుడు షేక్ షాబాజ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఎస్‌ఐ సంజీవరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నవాబుపేట, డిసెంబర్ 24: నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ కింద నమోదు అయిన మూడు కేసులలో ముగ్గురికి ఒక రోజూ జైలు శిక్షను సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ ఉమాహరతి విధించినట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. కేశవపల్లికి చెందిన వడ్డె చెన్నయ కొండాపూర్ మండలం గొల్లపల్లికి చెందిన చెవురి శివకుమార్ అర్కతల గ్రామానికి చెందిన తల్లారి రాములకు రూ. 7వేలు ఒక రోజూ జైలు శిక్షను వేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అత్తాపూర్ గ్రామంలో జలమండలికి చెందిన భూమిని పరిశీలిస్తున్న అధికారులు

జలమండలి భూమి కబ్జా కాలేదు

జలమండలి అధికారులు

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం, అత్తాపూర్ గ్రామంలో జలమండలికి చెందిన భూమి కబ్జా కాలేదని జలమండలి అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 2006లో వివిధ సర్వే నంబర్లలో 24.20 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు కేటాయించిందన్నారు. ఈ భూమిలో 23, 51 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు ఎస్టీపీలను నిర్మించిందన్నారు. ఇటీవల కాలంలో మరో రెండు ఎస్టీపీల నిర్మాణం 64, 40 ఎంఎల్‌డీల సామర్థ్యంతో పనులు చేపడుతున్నామన్నారు. ఈ ఎస్టీపీల నిర్మాణ సమయంలో కొంతమంది స్థానికులు జలమండలి భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించారని అధికారులు పేర్కొన్నారు. కానీ అధికారులు అప్రమత్తమై పోలీసులు, హైడ్రా, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి సర్వే నిర్వహించి సరిహద్దుల్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ భూమి మొత్తానికి కాంపౌండ్ వాల్ కూడా నిర్మించారని, జలమండలికి సంబంధించిన భూమి కబ్జా కాలేదని అధికారులు తెలిపారు.

కబ్జాదారులు రెచ్చిపోయారు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత..

అడ్డుకుకున్న కబ్జాదారులు.. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

జవహర్‌నగర్, డిసెంబర్ 24: భూకబ్జాదారులు రెచ్చిపోయారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు వెళ్లిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధి, దేవేందర్‌నగర్‌లో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు మంగళశారం జవహర్‌నగర్ కార్పొరేషన్, దేవేందర్‌నగర్‌లోని సర్వే నెం. 645, 646, 655 ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను కూల్చివేసేందుకు రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పోలీసుల సహకారంతో మంగళవారం వెళ్లారు. కూల్చివేతలు చేపడుతుండగా ఒక్కసారిగా కబ్జాదారులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌పై దాడికి పాల్పడ్డారు. తాసీల్దార్ దేశాల మేరకు దాడికి పాల్పడిన ఇరుగదిండ్ల వెంకటేశ్, రాపొనోళ్ల రాజు, వడ్డెర శ్రీను, ముగ్గురు గుర్తు తెలియని మహిళలపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కఠిన చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను కూల్చివేసేందుకు వెళ్లిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌పై కబ్జాదారుల దాడి హేయమైన చర్య అని కాప్రా తహసీల్దార్ సుచరిత అన్నారు. విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారిపై భూకబ్జాదారులు దాడిచేయడం దుర్మార్గమని, ఇలాంటి ఘటనపై ఊరుకునేదే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజీపడేదే లేదని, ఎంతటివారినైనా వదిలిపెట్టమని ఆమె హెచ్చరించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మన్సూరాబాద్, డిసెంబర్ 24: తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మన్సూరాబాద్, హిమపురికాలనీకి చెందిన సోమసాని సతీశ్‌రెడ్డి వృత్తిరీత్యా ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. ఉద్యోగ నిమిత్తం సోమవారం ఉదయం బయటకు వెళ్లారు. విధులు ముగించుకుని రాత్రి 10.45 గంటలకు ఇంటికి చేరుకున్న సతీశ్‌రెడ్డి డోర్‌కు వేసిన తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. సూట్ కేసులో భద్రపర్చిన 4 తులాల బంగారు గొలుసు, విలువైన వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితుడు సతీశ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో ప్లాట్ల విక్రయం

ముగ్గురి అరెస్ట్

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

హయత్‌నగర్, డిసెంబర్ 24: ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి ఖాళీగా ఉన్న ప్లాట్లను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్మన్‌ఘాట్, గ్రీన్‌పార్కు కాలనీకి చెందిన ముడావత్ దీప్లా నాయక్, నందనవనంకు చెందిన కేతావత్ పూల్‌సింగ్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన మాచగోని రంగయ్య, బిరాదర్ మారుతీ, స్వామి నాయక్, రమేశ్ నాయక్, మరికొంతమంది కలిసి కొంత కాలంగా ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగని ప్లాట్లను గుర్తించి వాటి సీసీ కాపీల ద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లను తయారు చేసి అమాయకులకు విక్రయించి మోసాలకు పాల్పడుతున్నారు. వాటిల్లో భాగంగా పెద్దఅంబర్‌పేట సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం నందు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గండిచెరువు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.183, 186, 187, 188, 189లలో చాలా కాలంగా రిజిస్ట్రేషన్ జరగని ప్లాట్లను గుర్తించి వాటికి ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారుచేసి ఉషాకిరణ్ మూవీస్ ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి ఫైనాన్స్ వారికి విక్రయించారు. దీన్ని గమనించిన సదరు ప్లాటు యజమాని వాణి, భర్త శ్యామ్ ప్రసాద్‌ల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించారు. ప్రధాన నిందితులైన మూడావత్ దీప్లానాయక్, కేతావత్ పూల్‌సింగ్, రంగయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏకసభ్య కమిషన్‌ను కలిసిన బేడ బుడగ జంగం నేతలు

హయత్‌నగర్, డిసెంబర్ 24 : బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి(బీజేహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై మంగళవారం బీఆర్‌కే భవన్‌లో ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీయ్ అక్తర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా బేడ బుడగ జంగాల సమస్యలపై ఎస్సీ-59 ఉప కులాలలోని సంచార కులాలన్నింటి కలిపి 5శాతం రిజర్వేషన్ కల్పించాలని విన్నవించారు.



వినతిపత్రం అందజేస్తున్న బేడ బుడగ జంగం నాయకులు

1950 నుంచి ఇప్పటి వరకు రిజర్వేషన్ ఫలాలు అందలేక ఆర్థికంగా, సామాజికంగా అసమానతలకు లోనైన వెనుక బాటు తనానికి గురైన బేడ బుడగ జంగాలకు ఎస్సీ వర్గీకరణలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. కమిషన్‌ను కలిసిన వారిలో బీజేహెచ్‌పీఎస్ వ్యవస్తాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం, జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నర్సింహా, కడమంచి సహదేవుడు, తూర్పాటి శ్రీనివాసులు, తూర్పాటి చిన్న కోటయ్య, గగనం రాజు, బైలుపాటి బన్నికుమార్ తదితరులు ఉన్నారు.

బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నూతన కమిటీ

నూతన కమిటీ కార్యవర్గసభ్యులు

హయత్‌నగర్, డిసెంబర్ 24 : బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి హయత్‌నగర్ డివిజన్ కమిటీ(బీజేహెచ్‌పీఎస్) నూతన కమిటీ ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కమిటీ ఎన్నికకు ముఖ్య అతిథులుగా బీజేహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నరసింహా, రాష్ట్ర కోశాధికారి తూర్పాటి చిన్న కోటయ్య, సీనియర్ నాయకుడు కోమారి వెంకటేశ్, రాష్ట్ర నాయకులు గగనం రాజు, బైలెపాటి బన్నీ, రేవల్లి యాదగిరి, బీజేహెచ్‌పీఎస్ యూత్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సిరివాటి రమేశ్ సమక్షంలో హయత్‌నగర్ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కొడిగంటి రామస్వామి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా తూర్పాటి పెద్ద కోటయ్య, ఉపాధ్యక్షులుగా కోడిగంటి విష్ణు, దుదుర్క్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా మోతే వెంకటేశ్, కార్యదర్శులుగా కోడిగంటి కురుమయ్య, సహాయ కార్యదర్శిగా కోడిగంటి కృష్ణ, కోశాధికారిగా మోతే శ్రీనుతోపాటు పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

డయల్ యువర్ డీఎంకు 19 ఫిర్యాదులు

వికారాబాద్, డిసెంబర్ 24 : డయల్ యువర్ డీఎంకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ తెలిపారు. మంగళవారం వికారాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ వికారాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. డయల్‌యువర్ డీఎం కార్యక్రమం ఉదయం 11 నుండి 12 గంటల వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ సమస్యలపై 19 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రధానంగా బంట్వారం మండలం బొపునారం, తొర్రు మామిడి, మర్పల్లి మండలంలోని షాపూర్‌తండా, పంచలింగాల్ నుంచి జహీరాబాద్, కొడంగల్, కోట్‌పల్లి, రొంపల్లి, నవాబుపేట, శంకర్‌పల్లి, టేకులపల్లి తదితర గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం కల్పించాలని ఫిర్యాదులు చేశారన్నారు. గడ్డ మీద్దమీది గంగారం, కోట్‌పల్లి, తొర్రుమామిడి, రొంపల్లి, నవాబుపేట, శంకర్‌పల్లి, టేకులపల్లి, పులుమామిడి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైందన్నారు. దీంతో బస్సులు నడిపేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వికారాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో 63 బస్సులు ఉన్నాయని, అదనంగా బస్సులు ఉంటే మరింత సర్వీస్ అందించే వారమని తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి

బంట్వారం, డిసెంబర్ 24: ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఎంపీడీవో రాములు తెలిపారు. మంగళవారం మండల కేంద్రం లోని ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ర్యాండమ్‌గా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ఆన్‌లైన్ సమస్యలు తలెత్తడంతో కొంత ఆలస్యం అవుతుందని తెలిపారు ఇప్పటికే మండలంలో పలు గ్రామాల్లో 90 శాతం పూర్తి కాగా పెద్ద గ్రామాల్లో 60 శాతం పూర్తైనట్లు తెలిపారు.

కుక్క కాటు బాధితులను ఆదుకోవాలి

కుక్కకాటు బాధితులతో బీఆర్ఎస్ యువజన విభాగం నేత రాజేందర్‌గౌడ్

వికారాబాద్, డిసెంబర్ 24 : కుక్కల దాడులతో నష్టపోయిన వారికి ప్రభుత్వం పరిహారం అందించాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ రాజేందర్ గౌడ్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలో కుక్కల వల్ల గాయపడిన ఇద్దరు చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెద్దేముల్ గ్రామంలో నష్టపోయిన పేద రైతుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు లోపల ఎటువంటి చర్యలు తీసుకుపోతే తీవ్రమైన నిరసన కార్యక్రమాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి , సత్యనారాయణ, నరసింహారెడ్డి, నగేష్ గౌడ్, బుచ్చయ్య, లక్ష్మారెడ్డి, దశరథ్, మహిళలు పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణికుడి గొలుసు తస్కరణ

బంజారాహిల్స్, డిసెంబర్ 24: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న యువకుడి దృష్టి మరల్చి బంగారు గొలుసును కాజేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడం జిల్లాకు చెందిన శ్రీకంఠ.. కేపీహెచ్‌బీలోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. మంగళవారం మెహదీపట్నంకు వెళ్లి తిరిగి ఆర్టీసీ బస్సులో కేపీహెచ్‌బీకి బయలుదేరాడు. బస్సు మాసాబ్ ట్యాంక్ దాటగానే పక్కసీట్లో కూర్చున్న వ్యక్తి తనకు వాంతి వస్తున్నట్లు నటించాడు. దీంతో గుట్కా మీదపడుతుందనే ఉద్దేశంలో సీట్లోంచి లేచి ముందుకు వెళ్లి నిలబడ్డాడు. అతడిని ముగ్గురు, నలుగురు చుట్టుముట్టి ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కాసేపటికి బస్సు జీవీకే వద్దకు రాగానే తనమెడలోని గొలుసు మాయమయినట్లు గుర్తించిన శ్రీకంఠ.. ఈ విషయాన్ని కండెక్టర్‌కు చెప్పాడు. అంతకుముందు స్టాప్‌లో కొంతమంది వ్యక్తులు హడావుడిగా దిగారని, వారే తన దృష్టి మరల్చి 11గ్రాముల బంగారు గొలుసు కాజేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీమతి కుంటి మనీష తండ్రి రామయ్య W/o నర్సింలు, వయస్సు 21 సం।లు, వృత్తి: వ్యాపారము, నివాసము ఇం.నెం: 3-62, ఫోలారం గ్రామము, షాబాద్ మండలము, రంగారెడ్డి జిల్లా వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్థిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఇట్టి ఈ యొక్క ఆస్థిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచి నందు సంప్రదించగలరు. లేనిచో ఈ యొక్క ఆస్థిపై ఎలాంటి వివాదాలు లేనివిగా పరిగణించి మా క్లయింట్ ముందుకు కొనసాగుతారు.

షెడ్యూల్ ప్రాపర్టి : శ్రీ వినాయకనగర్ కాలనీ, తాళ్ళపల్లి గ్రామము, షాబాద్ మండలము, జిల్లా రంగారెడ్డిలో సర్వే నెం.282, ప్లాటు నం.65, 150 చదరపు గజముల ప్లాటు కలదు.

హద్దులు : తూర్పు : ప్లాట్ నం.66, **పడమర:** 30 ఫీట్ల వైడ్ రోడ్డు, **ఉత్తరము:** ప్లాటు నం.53, **దక్షిణము:** 25 ఫీట్ల వైడ్ రోడ్డు.

బి.రాజశేఖర్ రాజు, అడ్వకేట్
ఇం.నెం. 12-24, నెహ్రూ కాలనీ,
షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
సెల్: 9849415189

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీమతి దుడ్డిపాలు పావని W/o బుచ్చిరెడ్డి, వయస్సు 26 సం।లు, వృత్తి: వ్యాపారము, నివాసము ఇం.నెం: 13-4, చెన్నారం గ్రామము, తలకొండపల్లి మండలము, రంగారెడ్డి జిల్లా వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్థిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఇట్టి ఈ యొక్క ఆస్థిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచి నందు సంప్ర